సంక్షోభంలో పాడి పరిశ్రమ

- రోజురోజుకూ పెరుగుతున్న నిర్వహణ వ్యయం
- పాడి రైతులకు గిట్టుబాటుకాని ధరలు
- పెరిగిన ఖర్చులతో నష్టాలు తప్పడం లేదని ఆవేదన



చించొల్లిలో పాడి రైతు ఏర్పాటు చేసిన గేదెల షెడ్డు

బాన్సువాడ : అమ్మాలంటే అడవి..కొనాలంటే కొరివి అన్నచందంగా మారింది పాడి రైతుల పరిస్థితి. పాల కేంద్రాల్లో ధరలు పెరగకపోవడం, పశుగ్రాసం, పచ్చి మేత కొరతతో పాటు దాణా ధరలు విపరీతంగా పెరగడంతో పాడి పోషణ వ్యయం పెరిగి పాడి రైతులు నష్టాలపాలవుతున్నారు. పెరుగుతున్న ఖర్చులు భరించలేక పశువులను అమ్ముకుంటున్నారు. పదేళ్ల క్రితం వరకు పాడి పరిశ్రమ రైతులకు దాణాతో పాటు పశుగ్రాసం రేట్లు తక్కువగా ఉండడంతో పాటు గ్రామాల్లో బీడు భూములు ఉండటంతో పచ్చి మేతకు ఇబ్బంది లేకుండా ఉండేది. పాల రేటు తక్కువగా ఉన్నప్పటికీ పాల దిగుబడి ఎక్కువగా ఉండడం, నిర్వహణ ఖర్చు అంతగా లేకపోవడంతో లాభాల బాటలో నడిచారు. ఇటీవల కాలంలో పాల ధరలు పెరగకపోవడంతో నిర్వహణ భారం పెరిగిందని రైతులు అంటున్నారు.

పెరగని పాల ధరలు..

గతంలో పాడి పరిశ్రమ నిర్వహణలో లాభాలు తక్కువగా ఉండడంతో పాడి రైతులు ఇతర రాష్ట్రాల నుంచి మేలు జాతి గేదెలను ఎక్కువ రేటుకు కొనుగోలు చేసి తీసుకొచ్చేవారు. వాటి నిర్వహణ కోసం రైతులు వారికున్న భూముల్లో రూ.లక్షలు ఖర్చు చేసి షెడ్లు, నీటి వసతి, పచ్చిగడ్డి పెంచడం వంటి ఏర్పాట్లు చేసుకునేవారు. కొందరు పాలను హోటళ్లు, గృహ అవసరాలకు లీటరుకు రూ.70 వరకు విక్రయిస్తుండగా మండల కేంద్రాల్లో పాలకేంద్రాలు, డెయిరీల్లో విక్రయిస్తున్న పాడి రైతులు మాత్రం తమకు వారు ఇచ్చే రేటు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగా రైతుల నుంచి సేకరిస్తున్న పాల ధరలను శాతాన్ని బట్టి లీటరుకు రూ.40 నుంచి రూ.45 వరకు చెల్లిస్తున్నారు. ఎక్కువ శాతం ఫ్యాట్ వస్తే మాత్రం రూ.50 వరకు ధర పలుకుతుందని రైతులు అంటున్నారు. కానీ బహిరంగ మార్కెట్‌లో ఇవే పాలు లీటరుకు రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

విపరీతంగా పెరిగిన దాణా ధరలు..

గతంలో పోలిస్తే ప్రస్తుతం పశుగ్రాసం, దాణా ధరలు రెట్టింపయ్యాయి. పశువులకు ఎక్కువగా కావాల్సిన ఎండుగడ్డి మోపు రూ.60 నుంచి రూ.80 వరకు, తవుడు క్వింటాలుకు రూ.3 వేలు, మినప పొట్టు రూ.3 వేలు, పెసర పొట్టు రూ.4 వేలు, పాలు పితికే కూలీకి నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండటంతో పాడి రైతులు నష్టాలపాలవుతున్నారు. కొద్ది మంది రైతులు ఈ పాడి పోషణ ఖర్చులు భరించలేక తక్కువ ధరలకు తమ పశువులను అమ్ముకుంటున్నారు. కొందరు అధిక ధర పెట్టి దాణా, పశుగ్రాసం కొనుగోలు చేసి పాడి పరిశ్రమను నిర్వహిస్తున్నా..పాల కేంద్రాలు, డెయిరీ యాజమాన్యాలు ధరలు పెంచకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంటున్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, అధికారులు సబ్సిడీపై రుణాలు, దాణా అందించేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

భారంగా మారింది



గతంతో పోలిస్తే ప్రస్తుతం పశుపోషణ చాలా భారంగా మారింది. గడ్డి, దాణా ధరలు రెట్టింపయ్యాయి. పాల కేంద్రాల్లో లీటరు పాల ధర రూ.45 నుంచి రూ.50కు మించడం లేదు. మా దగ్గర పాలను తీసుకెళ్లి మండల కేంద్రాలకు తీసుకెళ్లి రూ.70 వరకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు.

– బొగ్గుల రాములు, చించొల్లి

ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరాలయం



భిక్కనూరులోని వేంకటేశ్వరాలయం

భిక్కనూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు భిక్కనూరులోని వేంకటేశ్వరాలయాన్ని గురువారం ముస్తాబు చేశారు. ఆలయం ప్రాంగణాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు వేంకటేశ్వరుడికి పుష్పాభిషేకం

రామారెడ్డి: రామారెడ్డిలో వెలిసిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నేడు వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి అభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు నామాల యాదగిరి తెలిపారు. రామారెడ్డి, ఇసన్నపల్లి భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలి రావాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలిశారు. పంచాయతీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలు, తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై చర్చించారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు అందించారని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ నేత భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



పిట్లం(జుక్కల్): రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని వివిధ పాఠశాలలను మండల నోడల్ అధికారి రమణారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలలో అమలవుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబంధించి పరీక్ష పేపర్లను పరిశీలించారు. రిపోర్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎఫ్ఏ3 మార్కులను ఆన్‌లైన్ లో పొందుపరచాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలోని వంటగదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

సైన్స్ ప్రదర్శనలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



ఆకాష్ రూపొందించిన విత్తనాలు నాటే యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాజనర్సింహ



సాయిచరణ్‌ను అభినందిస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 7, 8, 9 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శన, ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికయ్యాడు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి ఎం. ఆకాష్ విత్తనాలు నాటే యంత్రాన్ని తయారు చేసి ప్రదర్శించాడు. మంత్రి దామోదర రాజనర్సింహ, యంత్రాన్ని పరిశీలించారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో ఆకాష్‌ను జాతీయ స్థాయి ప్రదర్శన పోటీలకు ఎంపిక చేయడంతో పాటు ఇన్‌స్పైర్ మనక్ అవార్డు వచ్చినట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. ఆకాష్‌కు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు ఎస్.జైపాల్‌ను డీఈవో ఎస్.రాజు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్న మల్లారెడ్డి విద్యార్థి..

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి సాయి చరణ్ జడ్చర్లలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చాటారని ఉపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు. మూలకాల ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను మొదటి నుంచి చివరి వరకు, చివరి నుంచి మొదటి మూలకం వరకు రెండు నిమిషాల్లోనే పఠనం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సాయి చరణ్, గైడ్ టీచర్ ప్రవీణ్ కుమార్‌లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బాన్సువాడ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్, సభ్యులు మణెమ్మ, పర్వయ్య, రమేష్‌నాయక్, సత్యనారాయణ ఉన్నారు.

జిల్లా పద్మశాలి సంఘం క్యాలెండర్..



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు సిరిగాద లక్ష్మీనరసింహులు ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెర రాజయ్య, కోశాధికారి సబ్బని ధర్మపురి, గౌరవ అధ్యక్షుడు రాములు, ప్రతినిధులు నరసయ్య, అడ్వొకేట్ నాగభూషణం, న్యాయ సలహాదారుడు వెంకటనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలు రాజమణి, జాయింట్ సెక్రెటరీ భారతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు జిల్లా విద్యార్థినులు



కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థినులు గురువారం తరలివెళ్లారు. ఈ నెల 9 నుంచి 11వ వరకు జరిగే పోటీలలో అండర్–14 బాలికల విభాగంలో సింధూజ, జ్యోత్స్న, విరీష, తనిష్క, అవంతి, సునీత, నికితలు యోగా ప్రదర్శన ఇవ్వనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కోచ్ గౌమతి, మేనేజర్ లావణ్యలు విద్యార్థినులతో కలిసి వెళ్లారు.

ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి



బాన్సువాడలో ఎడ్లబండితో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. గురువారం బాన్సువాడలో ఎడ్ల బండితో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటూ మోసం చేస్తున్నారని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బాన్సువాడలో ప్రారంభించిన ఎక్సైజ్ భవనం, శంకుస్థాపన చేసిన అమృత్ 2.0 పథకం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయని గుర్తు చేశారు.

బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలి

బాన్సువాడ పట్టణాన్ని జిల్లాగా ప్రకటించాలని జుబేర్ కోరారు. కాంగ్రెస్ నాయకులు గతంలో బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలని నిరాహార దీక్షలు చేశారని, ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. బోధన్ వయా బాన్సువాడ మీదుగా బీదర్ రైల్వేలైను ఏర్పాటు చేయిస్తామని చెప్పిన ఎంపీ సురేష్ షెట్కార్ ఆ మాటనే మర్చిపోయారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు మోచి గణేష్, ఎర్రవాటి సాయిబాబా, మ్యాతరి సాయిలు, శివ, రమేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, మహేష్, దత్తు, సాయిలు, గోపి, సంజయ్ తదితరులున్నారు.

చిత్రకళల పరీక్షలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కేంద్రంలోని వాగ్దేవి విద్యాలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు జరగనున్న చిత్రకళల పరీక్షలకు మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగా కిషోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం మద్నూర్ గురుకుల పాఠశాలలో ఎంపికైన 46 మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



పిట్లం(జుక్కల్): ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, అలా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఏఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద గురువారం నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్సై లింబాద్రి పాల్గొని వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

'ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూడొద్దు'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూడడం మానుకున్నప్పుడే మనిషి ప్రశాంతంగా ఉండగలుగుతారని, ఇంటి పనులు, సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, పుస్తక పఠనం, వ్యాయామం లాంటి శారీరక పనులు అలవాటుచేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. కళాశాల సోషల్‌వర్క్ విభాగం, పద్మపాని సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'మానసిక ఆరోగ్యంపై అవగాహన' ఒక రోజు కార్యశాల నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ అరుణిమ మాట్లాడుతు.. మానసిక సమస్యలుంటే ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలున్నందున ముఖ్యంగా విద్యార్థులు అతి జాగ్రతగా ఉండాలన్నారు. సమస్య వచ్చిన వెంటనే 1800 120 820 050 హెల్ప్‌లైన్‌కు మాట్లాడాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, సమన్వయకర్త విశ్వప్రసాద్, సోషల్ వర్క్ శాఖాధిపతి జి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు రమేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి వివేకానంద స్ఫూర్తి



రామారెడ్డి: నేటి ప్రపంచానికి స్వామి వివేకానంద స్ఫూర్తిగా నిలుస్తాడని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు అన్నారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రామారెడ్డి బాలికల పాఠశాలలో గురువారం క్విజ్, వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

సొసైటీలు రైతులకు సహకరించాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ప్రతి సొసైటీ రైతులకు సహకరించే విధంగా నడపాలని డీఏవో తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం దుర్కి సొసైటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు అందుబాటులో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఏవో భవాని, పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, ఏఈవో గోపాల్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

నాగన్నగారి మెట్ల బావి నిర్మాణం అద్భుతం



మెట్ల బావి వద్ద అధికారి దయానంద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

లింగంపేట(ఎల్లారెడ్డి): నాగన్నగారి మెట్ల బావి నిర్మాణం అద్భుతంగా ఉందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి దయానంద్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆనాటి పాలకులు రాజా వెంకటనర్సింహారెడ్డి ప్రజల నీటి అవసరాలను తీర్చడం కోసం మెట్లబావిని తవ్వించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోందన్నారు. రాళ్లు, డంగు సున్నంతో పటిష్టంగా, సౌందర్యాత్మకంగా నిర్మించడం అప్పటి కళా నైపుణ్యానికి నిదర్శనమన్నారు. కలెక్టర్ చొరవ, ఇన్ఫోసిస్ సంస్థ ద్వారా శిథిలావస్థకు చేరుకున్న బావిని పునరుద్ధరించడం మంచి విషయమన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆ తర్వాత సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రీజినల్ కో–ఆర్డినేటర్ కిరణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ వెంకటరాములు, పాఠశాల సమన్వయకర్త రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ఎంపిక



పావనిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ గాంధీ తదితరులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని పావని రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్టుకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గాంధీ గురువారం తెలిపారు. జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో ద్వితీయ బహుమతి సాధించిన పావని రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకి ఎంపికై ందన్నారు. పావనినీ మెమోంటో, ప్రశంసా పత్రంతో ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు జహంగీర్, రాజశేఖర్, ప్రియదర్శిని, లక్ష్మణ్‌సింగ్, బల్వంత్‌రావు తదితరులున్నారు.

క్లుప్తంగా

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



నిజాంసాగర్(జుక్కల్): సహకార సంఘాలలో పాటు ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణదారులు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బిచ్కుంద ఏడీఏ ఇంద్రసేన పేర్కొన్నారు. గురువారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, మల్లూర్ సహకార సంఘాలతో పాటు మాగి గాయత్రి కర్మాగారం ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు. యాసంగి సీజన్‌లో పంటల సాగు చేస్తున్న రైతులకు కాంప్లెక్స్ పాటు యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట మండల ఏవో అమర్‌ప్రసాద్ తదితరులున్నారు.

ఏఎస్పీతో టీఎన్‌జీవోల భేటీ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన చైతన్యారెడ్డిని టీఎన్‌జీవో నాయకులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఉద్యోగులందరు పోలీసులకు సహకారం అందించాలని ఏఎస్పీ వారిని ఈ సందర్భంగా కోరారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.చక్రధర్, ప్రతినిధులు దేవరాజు, లక్ష్మణ్ తదితరులున్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. చిన్న చిన్న పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో, కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరలోనే ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, కాంగ్రెస్ నాయకులున్నారు.

'ఉపాధి' పనులను వేగవంతం చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంటులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజు నర్సరీలలోని మొక్కలకు నీళ్లను పోసి సంరక్షించాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని, పనులను గుర్తించిన అనంతరమే పనులను ప్రారంభించాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ హన్మండ్లు, ఏపీవో కృష్ణగౌడ్, టెక్నికల్ అసిస్టెంటు మహిపాల్‌రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లు ఉన్నారు.

దోమకొండలో ఉపాధి హామీ గ్రామసభ



దోమకొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామసభ చేపట్టారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ సభ్యులు చదివి వినిపించారు. ఈజీఎస్ ఏపీవో రజని, జీపీ కార్యదర్శి యాదగిరి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లింగం తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్‌కు నివాళులు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ముస్లిం తొలి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



టీటీపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ అన్నారు. గురువారం కోనాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అలాగే లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా పొందుపర్చాలని పంచాయతీ కార్యదర్శి భరత్‌ను ఆదేశించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో గురువారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శివకృష్ణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వార్డెన్ విజయశాంతి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో ఉచిత కంటి శిబిరం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించి 54 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు హరికిషన్ తెలిపారు. వీరిలో కంటి ఆపరేషన్ల నిమిత్తం 24 మందికి రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు.

చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలి రావాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో ఈనెల 10న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలి రావాలని సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు పిలుపునిచ్చారు. గురువారం తాడ్వాయిలో వారు మాట్లాడారు. ఉదయం 8 గంటలకు తాడ్వాయి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చనందుకు ఈనిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. నేతలు రాజిరెడ్డి, ధర్మారెడ్డి, మంగారెడ్డి, నవీన్‌రెడ్డి , రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



రాజంపేట: కొండాపూర్ గ్రామంలోని ఐకేపీ సంఘ సభ్యులకు కామారెడ్డి సీఎఫ్ఎల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న బీమా పథకాలు, బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధులు డి.రాజు, జె. ఆనంద్‌రెడ్డి, ఐకేపీ సీసీ బాగయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.